కార్మికుల వేతనాలు పెంచాలి

హస్తినాపురం: జీహెచ్‌ఎంసీ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేసి వేతనాలు పెంచాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ డిమాండ్ చేశారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనంకాలనీ, ఇంద్రసేనారెడ్డినగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్లో ఆలేటి ఎల్లయ్య, పి.శ్రీనివాస్‌అధ్యక్షతన జరిగిన సమావేశంలో చంద్రమోహన్ పాల్గొని మాట్లాడారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 18వేల మంది కార్మికులుగా పనిచేస్తున్నారని, అందులో అత్యాధికంగా ఎస్సీలు, ఎస్టీలు, బీసీల కు చెందిన పేద మహిళలు ఉన్నారని వీరిని వెంటనే ప్రభుత్వం పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వల్లమ్మ, యాదమ్మ, కళావతి, ఎల్లమ్మ, అంజమ్మ లక్ష్మీదేవి, హేమలత, చంద్రమ్మ పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పద్మావతి కాలనీలోని బంగారు మైసమ్మ దేవాలయం 11 వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.వార్షికోత్సవ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులు అన్న ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో రాజుగౌడ్, కిషన్, రాజు, సుభాష్, కిరణ్, రామ్మోహన్, రామయ్య పాల్గొన్నారు.

బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

లింగోజిగూడ: బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని రంగారెడ్డి జిల్లా డీఈఓ సుశీంద్ర రావు అన్నారు. ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణలో భాగంగా గురువారం ఎల్‌బీనగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డీఈఓ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉమెన్ ట్రాఫికింగ్, లైంగిక వేధింపులు, సైబర్ ట్రాఫికింగ్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించే విధంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీఓ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ శ్రీలత, కృష్ణవేణి పాల్గొన్నారు.

విద్యార్థినులకు విద్యాజ్యోతి స్కాలర్‌షిప్స్

బడంగ్‌పేట్: ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థినులకు కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్స్ అందజేశారు. గురువారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడంగ్‌పేట కెనరా బ్యాంక్ అసిస్టెంట్ ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్స్ అందజేశారు. ప్రభుత్వ బడుల్లో ప్రతిభ గల బాలికలను ప్రోత్సహించేందుకు ఈ విధంగా అవార్డులను అందజేస్తున్నామని ప్రమోద్‌కుమార్ తెలిపారు. 5 నుంచి 10వ తరగతి విద్యార్థినులను ప్రోత్సహిస్తూ చదువుల్లో రాణించేలా విద్యాజ్యోతి పేరుతో ప్రతి ఏటా ఇస్తున్నామన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగినప్పుడే బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గొలుసుకట్టు చెరువులకు జలకళ



మహేశ్వరం/శంషాబాద్ రూరల్: గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో జల్‌పల్లి పరిసరాలలోని గొలుసు కట్టు చెరువులకు జలకళ సంతరించుకుంది. శంషాబాద్ విమానాశ్రయ పరిసరాలు, మామిడిపల్లి కొండల నుంచి భారీగా వస్తున్న వరదనీరు జల్‌పల్లి చెరువుకు ప్రవాహంగా మారింది. జల్‌పల్లి గ్రామం ఎగువ నుంచి వచ్చిన నీరు కూడా తోడవడంతో అప్పటికే దాదాపుగా నిండిన ఈ చెరువు నాలుగు రోజుల నుంచి అలుగు పారడం ప్రారంభమైంది. జల్‌పల్లి చెరువు అలుగు పారడంతో పాటు మిగులు నీరు పి–7 కార్గో రోడ్డులో పెద్ద ఎత్తున పారుతుండడం.. ఈ చెరువు దిగువన ఉన్న కొచ్చెరువు సైతం పూర్తిగా నిండి కిందికి మత్తడి దూకుతున్న జల సవ్వడి దృశ్యాలను వీక్షించేందుకు జల్‌పల్లితో పాటు మైలార్‌దేవ్‌పల్లి, వాంబే కాలనీ, లక్ష్మీగూడ, శంషాబాద్, పాతబస్తీ ప్రజలు తరలివస్తున్నారు. కార్గో రోడ్డుపై పారుతున్న నీటిలో చిన్నారులు కేరింతలు కొడుతూ.. చేపలు పడుతూ.. ఈత కొడుతూ ఆనంద డోలికల్లో మునిగిపోతున్నారు. కొండలు.. చెట్లు...పచ్చిక బయళ్ల నడుమ కొనసాగింపుగా ఉన్న ఈ చెరువుల అందాలు పల్లె ప్రకృతి రమణీయతకు ప్రతిబింబంగా నిలుస్తున్నాయి. నగరం దాటి ఎక్కడో వందల కిలోమీటర్ల దూరంలోని జలపాతాల వద్ద కనిపించే ఈ కమనీయ దృశ్యాలు జల్‌పల్లిలో కనిపిస్తున్నాయి.

కాలువలు మాయం..
కాలనీలు జలమయం

● గొలుసుకట్టు కాలువ పూడ్చేశారు ● ఇబ్బందులు పడుతున్న కాలనీలవాసులు ● పట్టించుకోని అధికారులు

హయత్‌నగర్: భారీగా కురుస్తున్న ఇళ్లల్లోకి వరద నీరు చేరుతోంది. ఎగువనున్న మాసబ్ టాంక్ చెరువు మత్తడి దూకుతోంది. దిగువన ఉన్న ఈదుల చెరువు అలుగు పారుతోంది. మధ్యలో ఉన్న బాతుల చెరువు మాత్రం చుక్క నీటికోసం తహతహలాడుతోంది.ఇది హయత్‌నగర్‌లోని బాతుల చెరువు దుస్థితి. అధికారుల అవినీతి, పాలకుల నిర్లక్ష్యం కారణంగా చెరువులోకి చేరాల్సిన నీరు ఇళ్లు, రోడ్లపైకి చేరుతుంది. తుర్కయాంజాల్ మాసబ్‌టాంక్ చెరువు అలుగు నీరు ఇంజాపూర్ జిలాన్‌ఖాన్ చెరువు మీదుగా రాచకాలువ ద్వారా హయత్‌నగర్ బాతుల చెరువులోకి వరద వచ్చే విధంగా గొలుసు కట్టు కాలువల నిర్మాణం జరిగింది. కానీ.. క్రమక్రమంగా రాచ కాలువ ఆక్రమణకు గురికావడంతో జిలాఖాన్ చెరువు నుంచి బయటికి వెళ్లే వరద నీరు బాతుల చెరువుకు రాకుండా దారి మళ్లి మునుగనూరు శివారులోని కాలువకు అక్కడి నుంచి బంజారా కాలనీ మీదుగా పెద్దఅంబర్‌పేట్ ఈదుల చెరువులోకి వెళ్తోంది. దీంతో ఇప్పటికే నిండిపోయిన ఈదుల చెరువులోకి మరింత నీరు చేరుతుండగా మధ్యలో ఉన్న బాతుల చెరువు మాత్రం నీరు లేక వెలవెలబోతోంది. ఇంజాపూర్ నుంచి సాహెబ్‌నగర్ మీదుగా హయత్‌నగర్ వరకు ఉన్న రాచ కాలువ పూర్తిగా ఆక్రమణకు గురి కావడంతో ఆ కాలువలో వెళ్లే వరద నీరు లక్ష్మినిలయకాలనీ, గరుడానగర్, వెంకటేశ్వర కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. కాలువకు దిగువన ఉన్న ఒంపు నుంచి ఇంజాపూర్ రోడ్డుపైకి నీరు వచ్చి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. వర్షం నీటిని ఒడిసిపట్టి చెరువులలోకి చేరే విధంగా నిర్మించిన గొలుసుకట్టు కాలవలు ధ్వంసం కావడంతో ఎంత వర్షం కురిసినా చెరువలోకి నీరు రావడం లేదని స్థానికులు అంటున్నారు.



లక్ష్మిప్రియ కాలనీలోకి చేరిన వరదనీరు

పునరుద్ధరించినా ఆగని ఆక్రమణలు

జిలాన్‌ఖాన్ చెరువు నుంచి హయత్‌నగర్ బాతుల చెరువు వరకు ఉన్న రాచ కాలువను మిషన్ కాకతీయ పథకంలో భాగంగా 2016లో రూ. 33 లక్షల వ్యయంతో పునరుద్ధరించారు. పనులు పూర్తయిన ఏడాదిలోనే కాలువ ఆక్రమణలు మొదలయ్యాయి. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా క్రమంగా కాలువ ఆనవాలు కనబడకుండా ఆక్రమించారు.. దీంతో కాలువలోకి చేరాల్సిన వాన నీరు ఇళ్ల మధ్యలోకి వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాలువలను పునరుద్ధరించి వరద నీరు చేరులోకి చేరేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇళ్లల్లోకి వరద..

చాదర్‌ఘాట్: హిమాయత్‌సాగర్ నుంచి వరద ప్రభావం మూసీలోకి విడుదల చేయడంతో మూసానగర్‌లో నీళ్లు రావడంతో స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు మలక్‌పేట సర్కిల్–6 డీసీ అలీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాదాపు 20 కుటుంబాలను మూసానగర్‌లోని కమ్యూనిటీ హాల్లోకి తరలించామన్నారు. మూసీకి ఆనుకొని ఉన్న కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే, జోనల్ కమిషనర్ వరద ముంపు ప్రాంతాలను పర్యటించారు. ఎవరూ ఆందోళన చెందవద్దని బాధితులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



కాలువను పూడ్చి ప్లాటు రాళ్లు పాతిన దృశ్యం



మూసానగర్‌లో ఇళ్లలోకి వచ్చిన వరదనీరు

గన్స్ అమ్మేందుకు యత్నిస్తున్న యువకుడి రిమాండ్

లింగోజిగూడ: బిహార్ నుంచి తీసుకొచ్చిన తుపాకులు అమ్మేందుకు యత్నించిన యువకుడిని రిమాండ్‌కు తరలించారు. గురువారం ఎల్‌బీనగర్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచకొండ కమిషనరేట్ సీసీ సుధీర్ బాబు వివరాలు వెల్లడించారు. బిహార్ రాష్ట్రం ఔరంగాబాద్, తాన బారుక్ బ్లాక్ రాంపూర్‌కు చెందిన శివకుమార్ నగరంలోని పెద్ద చెర్లపల్లిలో పుకట్‌నగర్‌లో కుటుంబంతో కలిసి ఉంటూ హమలీ పని చేస్తున్నాడు. శివకుమార్ గతంలో గాంజా చాక్లెట్లు అమ్ముతూ పట్టుబడడంతో అతనిపై కేసు నమోదు చేశారు. ఈ నెల 6న రాఖీ పండుగ ఉండటంతో తన సొంత గ్రామానికి వెళ్లిన శివకుమార్ అక్రమంగా డబ్బు సంపాదించేందుకు స్థానికంగా నివాసం ఉండే తన బామ్మర్ది కృష్ణ పాశ్వన్ సూచన మేరకు నగరంలో దేశీయ గన్‌లను అమ్మేందుకు తీసుకొచ్చాడు.విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఓటీ మల్కాజిగిరి, చర్లపల్లి పోలీసులు చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతన్న శివకుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అతని నుంచి 3గన్నులు, 10 రౌండ్స్ బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు.



వివరాలను వెల్లడిస్తున్న సీపీ సుధీర్‌బాబు

32 పోస్టులకు 145 దరఖాస్తులు

చాదర్‌ఘాట్: రాష్ట్ర వికలాంగులు వయో వృద్ధుల ట్రాన్స్‌జెండర్స్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బధిరుల ఆశ్రమ పాఠశాలలో టీజీటీ, ఎస్‌జీటీ 32 పోస్టులు ఉండగా తాత్కాలిక నియామకాలకు 145 దరఖాస్తులు వచ్చాయని డైరెక్టర్ అరుణ తెలిపారు. అర్హులను ఎంపిక చేసి త్వరలో నియామక పత్రాలు అందజేస్తామన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.37, వంకాయ రూ.18, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.14, క్యారెట్ రూ.45, దొండ రూ.18, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.23, దోసకాయ రూ.13, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.50, చామగడ్డ రూ.23, మునగ రూ.23, కందగడ్డ రూ.35, బీట్‌రూట్ రూ.28, కీర రూ.18, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.40. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

సందడిగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు

దిల్‌సుఖ్‌నగర్: దిల్‌సుఖ్‌నగర్, ఆర్‌కేపురం, సరూర్‌నగర్, మూసారంబాగ్, సైదాబాద్, ఐఎస్‌సదన్, పరిధిలోని విద్యాసంస్థల్లో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు రాధ, కృష్ణుల వేషధారణలతో సందడి చేశారు. అనంతరం శ్రీకృష్ణుడు, రాధా, గోపికల వేషధారణలో పిల్లలు, పెద్దలు ఉట్లు కొట్టారు.



ఆర్‌కేపురం నారాయణ స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో విద్యార్థులు

భాష్యం లిటిల్ ఛాంప్స్ పాఠశాలలో..

వనస్థలిపురం: వనస్థలిపురంలోని భాష్యం లిటిల్ ఛాంప్స్ పాఠశాలలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీకి చెందిన చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో అందరినీ అలరిస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థ జోనల్ ఇన్‌చార్జి అంకమ్మరావు, భాష్యం హైస్కూల్ ప్రిన్సిపాల్ సుజాత, ప్రైమరీ పాఠశాల ప్రిన్సిపాల్ హేమంతలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌లో..

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని నారాయణ స్కూల్‌లో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థినీ, విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చేసిన ప్రత్యేక నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం హేమాంబర్, ఆర్‌ఐ రవి ప్రసాద్, ఆర్‌అండ్‌డీ శివరంజని, మహేశ్వరి, కోఆర్డినేటర్స్ శరత్, ప్రిన్సిపాల్ సమీన పాల్గొన్నారు.



వనస్థలిపురం భాష్యం లిటిల్ ఛాంప్స్ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: పర్యావరణ హితం కోసం మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ పీఅండ్‌టీ కాలనీలో గణేష్ యువభక్త మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 40 అడుగుల మట్టి గణపతి పనులను ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. సుమారు 90 వేల ఇళ్లలో గణపతి పూజలు నిర్వహిస్తారని, వారంతా పురాతన శాస్త్రోక్తమైన సంప్రదాయ మట్టి గణపతిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాలనీలు, అపార్టుమెంట్ సంక్షేమ సంఘాల నాయకులు మట్టి గణపతి ఏర్పాటు చేసేలా అందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో భవాని ప్రవీణ్‌కుమార్, ప్రదీప్, సింగిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, నారాయణరావు, రాంకుమార్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, జ్ఞానేంద్రరావు, స్వామియాదవ్, రాజేశ్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

హయత్‌నగర్: హయత్‌నగర్ పట్టణ సీనియర్ సిటిజన్స్ ఫోరం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నక్క దర్శన్‌గౌడ్, సహ అధ్యక్షుడిగా కళ్లెం శంకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా బోడ భిక్షపతి, ఉపాధ్యక్షులుగా రామసత్తయ్యగౌడ్, పర్వతి మల్లారెడ్డి, ప్రభాకర్‌గౌడ్, టీఎస్.దాస్, లక్ష్మణస్వామి, ప్రధాన కార్యదర్శిగా నీరుడు సహదేవ్ ముదిరాజ్, కోశాధికారిగా లక్ష్మయ్యముదిరాజ్, సాంస్కృతిక కార్యదర్శిగా సూదం కేశవులు, జాయింట్ సెక్రెటరీలుగా గుమ్మ మధుసూదన్‌రెడ్డి, గోరంటి యాదయ్య, వెంకటప్పయ్యరెడ్డి, చంద్రయ్యగౌడ్, హమీద్, దేవ ముత్యాలు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా పిడుగు సుభాష్‌ముదిరాజ్, బూడిద నాగభూషణంగౌడ్, రాంచందర్, రాజలింగం, బూరం భిక్షపతి, కొత్తూరి విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు.

మూసీ పరీవాహక ప్రాంతాల్లో చెత్త వేయొద్దు

చాదర్‌ఘాట్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మూసీ పరీవాహక ప్రాంతాల్లో చెత్త కుప్పలు లేకుండా చూడాలని మలక్‌పేట డీసీ అలీ ఆదేశించారు. గురువారంఆయన మూసీ పరీవాహక ప్రాంతాన్ని పర్యటించి మాట్లాడారు. వర్షాలు కురుస్తున్న కారణంగా డెంగీ సోకే ప్రమాదం ఉంటుందని ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు వేయరాదన్నారు.అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు సమాచారం లేకుండా ఎక్కడికి వెళ్లరాదని గ్రేటర్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు.



అధికారులతో కలిసి ఓల్డ్‌మలక్‌పేటలో పర్యటిస్తున్న డీసీ, ఏఎంహెచ్‌ఓ

కుంగిపోయిన సర్వీస్ రోడ్డు

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్‌లోని జాతీయ రహదారి ఆనుకొని ఉన్న సర్వీస్‌రోడ్డు కుంగిపోయి గుంతలు పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. చైతన్యపురి పోలీస్ స్టేషన్ నుంచి బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వరకు ఉన్న ఈ సర్వీస్‌రోడ్డులో రెండు చోట్ల పబ్లిక్ టాయిలెట్స్ ఉన్నాయి. టాయిలెట్స్ కనెక్షన్ ఉన్న డ్రైనేజీ పైపులైను ప్రాంతంలో గుంతలు పడి భూమిలోపల ఉన్న పైపులు పగిలి రోడ్డుపైకి మురుగు ప్రవహిస్తుందని స్థానికులు వాపోతున్నారు. అటుగా రాకపోకలు సాగించే క్రమంలో దుర్వాసన వస్తోందని సంబంధిత సిబ్బంది స్పందించి వెంటనే మరమ్మతు చేయాలని కోరుతున్నారు.



రోడ్డుపై ఏర్పడిన గుంతలు

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ

మహేశ్వరం: త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ వార్డుసభ్యులు బండ మహేందర్, బండ బాల్‌రాజ్, చిట్టెం శివలింగంలతో పాటు పలువురు కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హిందూ, ముస్లింల మధ్యల బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందుతోందన్నారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలపై విసుగు చెంది ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో రెండు పార్టీలకు తగిన బుద్ధి చెప్పి బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పడుతారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బీజేపీ, కాంగ్రెస్‌లోకి వెళ్లిన నాయకులు మళ్లీ సొంతగూటికి వస్తారన్నారు. భవిష్యత్తు అంతా బీఆర్‌ఎస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బండ నర్సింహ పలువురు పాల్గొన్నారు.

సమరయోధుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

చార్మినార్: కేంద్ర సమచార, ప్రసార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో తెలుగు స్వాతంత్ర్య సమరయోధులపై సాలార్ జంగ్ మ్యూజియం సెంట్రల్ హాల్‌లో ఏర్పాటు చేసిన 5 రోజుల ఛాయాచిత్ర ప్రదర్శనను గురువారం ప్రముఖ సినీ రచయిత, రాజ్యసభ సభ్యుడు వి.విజయేంద్ర ప్రసాద్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ బి.జగదీశ్వర్‌రావు పత్రికా సమాచార కార్యాలయం, సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శృతిపాటిల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటు యోధులతోపాటు కొమరం భీం, కాళోజీ నారాయణరావు, సంగం లక్ష్మీబాయమ్మ, ముఖ్దూం మొహినుద్దీన్, దాశరథి తదితర 40 మంది స్వాతంత్ర్య సమరయోధుల వివరాలతోపాటు జాతీయ పతాకం రూపొందిన తీరుపై చిత్రాలు ఏర్పాటు చేశారు. విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ నాటి తరం చేసిన అమూల్యమైన త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. జగదీశ్వర్‌రావు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థ, ఆవిష్కరణలలో నూతన తరం క్రియాశీల భాగస్వామ్యంతోనే నిజమైన వికసిత్ భారత్ సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అగ్రభాగాన నిలవాలంటే నూతన ఆవిష్కరణలు మరింత అవసరమని అన్నారు. ఈ సందర్భంగా వివిధ డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు ఆపరేషన్ సిందూర్– ఆత్మనిర్భర్ భారత్ అనే అంశం మీద వ్యాసరచన, కవిత్వం పోటీలు నిర్వహించారు. విజేతలకు జగదీశ్వర్‌రావు, విజయేంద్ ప్రసాద్ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

జోరువాన

మహేశ్వరం: మండలంలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటలకు వాగులు, కాల్వల ద్వారా వరద నీరు చేరుకుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడ చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షం కురుస్తోంది. మండల పరిధిలోని కోళ్లపడకల్ ఫతేసాగర్ చెరువు, కల్వకోల్ చెరువు, దుబ్బచర్ల చెరువు, అమీర్‌పేట్ చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు వలలు అడ్డంగా పెట్టి చేపలు పట్టుకుంటున్నారు.

భక్తిశ్రద్ధలతో మైసమ్మ బోనాలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ రైతుబజార్‌లోని మైసమ్మ బోనాల ఉత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి భక్తులు బోనాలు, ఇతర మొక్కులను సమర్పించారు. ఉదయం నుంచే అమ్మవారి ఆలయం వద్ద భక్తులతో సందడి చేశారు. రాష్ట్ర పీసీసీ కార్యవర్గ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అశోక్, పున్న గణేష్, బండి మధుసూదన్‌రావు, నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, జంగారెడ్డి, అంజి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దేప భాస్కర్‌రెడ్డి